JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | ఆదివారం 01-03-2026
Medchal - Malkajgiri | Sunday 01-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 274
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 274 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com






## బాలికలకు ఉచితంగా
# హెచ్ పీవీ టీకా

- అజ్మీర్ లో ప్రారంభించిన మోడీ

**జయభేరి, జైపూర్, ఫిబ్రవరి 28 :**

బాలికల్లో పెరుగుతున్న సర్వైకల్ క్యాన్సర్ ముప్పును తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. కౌమార ప్రాయ బాలికలకు ఫ్రీగా హెచ్పివి టీకా అందిస్తోంది. దేశవ్యాప్తంగా టీకా పంపిణీ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. రాజస్థాన్ అజ్మీర్ వేదికగా ఈ వ్యాక్సినేషన్ మొదలు పెట్టారు. నాలుగు రకాల గర్భాశయ క్యాన్సర్ల నిరోధమే లక్ష్యంగా ఈ టీకా వేస్తున్నారు. బాలికలకు రెండు డోసుల్లో గార్డాసిల్ 4 టీకా అందిస్తారు. ఏటా కోటి 15లక్షల మంది బాలికలకు ఈ టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మన తెలుగు రాష్ట్రాల్లో దశలవారీగా 6లక్షల 75వేల మంది బాలికలకు ఈ టీకా అందించనున్నారు. ఇటు విజయనగరం జిల్లాలో సీఎం చంద్రబాబు, అటు హైదరాబాద్లో మంత్రి దామోదర రాజనర్సింహా ఈ వ్యాక్సినేషన్ పంపిణీ ప్రారంభించారు. 2006లో ఈ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 50 కోట్ల డోసులను పంపిణీ చేశారు. దీంతో అనేక దేశాల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్లు తగ్గినట్లు అంచనా. 160 దేశాల్లో ఇప్పటికే ఈ టీకా పంపిణీ కార్యక్రమం అమల్లో ఉండగా.. వీటిలో 90 దేశాలు సింగిల్ డోసులో అందిస్తున్నాయి. ఇప్పుడు భారత్ కూడా మొదలు పెట్టింది. అయితే ప్రపంచంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య చైనా, అమెరికా తర్వాత భారత్ మూడోస్థానంలో ఉంది. 2040 నాటికి దేశంలో ...మిగతాది 2 లో

## తెలంగాణ 4 కోట్ల
# ప్రజల పండుగ

"ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులు, ప్రజోపయోగ కార్యక్రమాలను రాష్ట్ర ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో రాష్ట్రంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు రాష్ట్రంలో ఈ ప్రణాళికను అమలు చేయాలని అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.




**జయభేరి, హైదరాబాద్ :**

జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ 4 కోట్ల ప్రజల పండుగ సంబురంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకను పురస్కరించుకొని 99 రోజుల పాటు జరిగే 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దేశ అభివృద్ధి పథంలోనూ, పరిపాలనలోనూ తెలంగాణను తిరుగులేని ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టాలనే లక్ష్యంతో అధికారులు పని చేయాలని శాఖల వారిగా అధికారులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. "గ్రామ స్థాయి నుంచి మండలస్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి వరకు షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలను విజయవంతం చేయాలి. అందుకు అవసరమైన ప్రణాళికను వెంటనే సిద్ధం చేసి ఆచరణలో చూపెట్టాలి. ఈ కార్యక్రమానికి ప్రత్యేక లోగో తయారు చేయడమే కాకుండా రాష్ట్రమంతా 99 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను షెడ్యూలును సీఎస్ గారు రూపొందించాలి. ఈ 99 రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్‌తో పాటు అన్ని విభాగాలు, రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అన్ని ఆఫీసుల్లో పారిశుధ్యం, పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించాలి. ఈ కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకుండా పక్కాగా అమలు చేయాలి. 99 రోజుల కార్యక్రమ పురోగతిని వ్యక్తిగతంగా పరిశీలిస్తా. క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తా. పరిపాలనలో అధునాతన సాంకేతిక నైపుణ్యాన్ని సమర్థంగా వినియోగించాలి. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పౌరులకు ...మిగతాది 2 లో

## కవిత ఇక
# అన్ స్టాపబుల్

- కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో సంతోషం వ్యక్తం చేసిన కవిత
- ఎప్పటికైనా కడిగిన ముత్యంలా బయటకు వస్తానని తెలుసు



**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 28 :**

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితులందరికీ క్లీన్ చిట్ వచ్చింది. మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఎమ్మెల్సీ కవిత సహా మొత్తం 23 మంది నిందితులకు ఊరట లభించింది. ఆ కేసులో కవిత పేరు తెరమీదకు వచ్చినప్పటి నుంచి.. అరెస్ట్ వరకు.. ఆ తర్వాత జైలు నుంచి విడుదల వరకు ఎన్నో డెవలప్ మెంట్స్ జరిగాయి. జైలు నుంచి విడుదల అయిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ యాక్టివిటీకి ఆమెను దూరంగా ఉంచారు గులాబీ బాస్. కొద్దిరోజుల పాటు సైలెంట్‌గానే ఉన్న ఆమె.. ఆ తర్వాత కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌తో పాటు ఇండైరెక్టుగా గులాబీ బాస్ కేసీఆర్‌ను ఇరుకున పెట్టేలా కామెంట్స్ చేసి గులాబీ దళంలో అగ్గిరాజేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌కు దూరమైన కవిత ...మిగతాది 2 లో

## మైండ్ గేమ్ ఆలోచనలో గులాబీ బాస్

- కాంగ్రెస్ తన అభ్యర్థుల ఎంపికలో మార్పులు చేసుకునేలా ఒత్తిడి తేవడమే ప్రధాన లక్ష్యం
- కాంగ్రెస్ పార్టీలో చీలికలు ఉన్నాయని నిరూపించడానికి చేసే ఒక రాజకీయ ప్రయోగం



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాజ్యసభ ఎన్నికల చదరంగంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ ఎత్తుగడలకు పదును పెడుతున్నాయి. సంఖ్యాబలం తక్కువగా ఉన్నా సరే పోటీకి దిగడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని బీఆర్ఎస్ భావిస్తుండగా, క్లీన్ స్వీప్ చేయాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది. అసెంబ్లీలో ఉన్న 119 మంది ఎమ్మెల్యేల లెక్కల ప్రకారం ఒక్కో అభ్యర్థి గెలవడానికి దాదాపు 60 ఓట్లు అవసరం. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు ఉన్న బలం రీత్యా గెలుపు సాధ్యం కాకపోయినా, ఒక మైనార్టీ ...మిగతాది 2 లో

## భూభారతి కాదు..
# అది భూదోపిడీ

- ధరణి మీద బురదజల్లి భూభారతి తెచ్చామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు
- రెవెన్యూ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది
- దీనిపై వెంటనే సిట్ వేసి దోషులను కఠినంగా శిక్షించాలని, ఖజానాకు రావాల్సిన ప్రతి పైసా రాబట్టాలని డిమాండ్.. హరీష్ రావు



**జయభేరి, జనగామ ఫిబ్రవరి 28 :**

కాంగ్రెస్ నాయకులు, అధికారుల జేబులు నింపడానికే కొత్త భూభారతి పోర్టల్ స్కామ్ వెనుక ఉన్న పెద్ద తలకాయలను కాపాడేందుకే ఆపరేటర్ల అరెస్ట్ మరిన్ని కనుగొనండి క్రీడా ఈవెంట్ టిక్కెట్లు సినిమా సమీక్షలు ప్రకటన సేవలు ధరణిని రద్దు చేసి తెచ్చిన భూ భారతితో ప్రజల ఆస్తులకు రక్షణ కరువైంది ఈ కుంభకోణంపై తక్షణమే సిట్టింగ్ జడ్జితో లేదా సిట్ తో విచారణ ...మిగతాది 2 లో

## ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఎప్ స్టీన్ ఫైల్స్

2 లో

## రోజుకో మలుపు
### భూదాన్ ఉద్యమం



**జయభేరి, ఖమ్మం, ఫిబ్రవరి 28 :**

కొన్ని రోజులుగా ఖమ్మం శివారు వెలుగుమట్లలోని వినోభా నవోదయ కాలనీ వార్తల్లో మార్మోగుతోంది. పదిహేను సంవత్సరాలకుపైగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లు, గుడిసెలను ప్రభుత్వం భారీగా పోలీసులను మోహరించి రాత్రికి రాత్రే ఖాళీ చేయించడం సంచలనంగా మారుతోంది. అడ్డుకునేందుకు బాధితులు చేసిన నిరసన సైతం ఎలాంటి ప్రయోజనం ఇవ్వలేదు. ఈ చర్యపై అన్ని వర్గాల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడా బాధితులకు తాము అండగా ఉన్నామని ప్రతిపక్షాలు ముందుకొస్తున్నాయి. బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా బాధితుల పరామర్శకు వెళ్తున్నారు. ఇంతకీ అసలేంటీ భూదాన్ భూముల వివాదం,దశాబ్దాల క్రితం ఆచార్య వినోబాభావే దేశవ్యాప్తంగా చేపట్టిన భూదాన్ ఉద్యమంతో స్ఫూర్తి పొందిన కొందరు దాతలు వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని సుమారు 31 నుంచి 60 ఎకరాల తమ భూమిని పేదలకు పంపిణీ చేయమని ...మిగతాది 2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## తెలంగాణ 4 కోట్ల ప్రజల పండుగ

అవసరమైన సేవలన్నింటినీ మరింత సులభతరం చేయాలి. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా అన్ని సేవలు పొందేలా సాంకేతిక సంస్కరణలు తీసుకురావాలి. కరెంట్ మీటర్, తమ ఇంటి అనుమతి, నల్లా కనెక్షన్ల వరకు ప్రభుత్వం నుంచి పొందాల్సిన అనుమతులకు, సేవలకు ప్రజలు ఆఫీసులకు రావాల్సిన అవసరం లేకుండా జరగాలి. వాహనం కొన్న షోరూంల్లోనే రిజిస్ట్రేషన్ జరిగే విధానం అమల్లోకి వచ్చినట్లుగా, ప్రతి విభాగంలోనూ సంస్కరణలు తీసుకురావాలి. ఏ ఫైలు, ఏ ఆఫీ ఎక్కడ ఉందో దరఖాస్తుదారు తెలుసుకునే సునాయస విధానం అమలులోకి రావాలి. సమూల మార్పులతో సాంకేతిక సంస్కరణలు అమలు చేసేందుకు సీనియర్ ఐఏఎస్ జయేష్ రంజన్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, మూడు వారాల్లో కమిటీ నివేదికను అందించాలి. ప్రతి విభాగం ఈ ఆఫీస్ విధానం, డిజిటల్ గవర్నెన్స్‌ను అమలు చేయాలి. అన్ని శాఖలకు సంబంధించిన డేటా నిల్వ చేస్తున్న పాత కాలం సర్వర్లను రాబోయే 20 సంవత్సరాలకు సరిపడేలా అప్‌డేట్ చేయాలి. సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయడానికి సాంకేతికతను వినియోగించాలి. మహాలక్ష్మి, రేషన్ కార్డులు, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు, ఆరోగ్యశ్రీ అర్హులైన వారందరికీ చేరాలి. సొంత స్థలముండి ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి అందాలి. రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునే ప్రక్రియ నిరంతరం కొనసాగాలి. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్యను అందించేలా రాష్ట్రంలో వంద మండలాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రారంభిస్తున్నాం. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేయటంతోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను మెరుగుపరిచే విధానాలు అమలు చేయాలి. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా ప్రభుత్వం రాష్ట్రాన్ని కేర్, ప్యూర్, రేర్ మూడు జోన్లుగా విభజించి దేశంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాం. కోర్ అర్బన్ రీజియన్‌లో చేపట్టాల్సిన సర్వీస్ సెక్టార్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకోవాలి. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు, ఉన్న పెరి అర్బన్ రీజియన్ ఎకనమిక్ దాదాపు 10 వేల చ.కి.మీ మాన్యుఫాక్చరింగ్ జోన్ భవిష్యత్తులో కీలకంగా మారుతుంది. అన్ని విభాగాల్లో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులతో పాటు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల డేటా కార్పొరేషన్ల వద్ద సిద్ధంగా ఉండాలి. రాష్ట్రంలో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండడానికి వీలు లేదు. ప్రతి శాఖకు సొంత భవనం ఉండాలి. బడ్జెట్ ప్రతిపాదనల్లో వీటిని చేర్చాలి. హైదరాబాద్ లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌తో పాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరం, విదేశీ పర్యటనతో రాష్ట్రానికి దాదాపు రూ. 8 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ ఒప్పందాలు ఫలవంతమయ్యేలా కార్యదర్శులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి అవి గ్రౌండయ్యేంత వరకు సంప్రదింపులు జరపాలి. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం, అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజలకు కోరుకున్న మార్పును అందిస్తామనే హామీతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ రోజుతో ప్రభుత్వం రెండేళ్ల మూడు నెలలు పూర్తి చేసుకుంది. ప్రజలు మార్పును స్వాగతిస్తున్నారు. ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు పునరంకిత భావంతో ముందుకు సాగాల్సిన సమయం వచ్చింది. ఇప్పటివరకు సాధించిన విజయాలను నిజాయితీగా అంచనా వేసుకుని, ఎక్కడ లోటుపాట్లు ఉన్నాయో అధికారులు గుర్తించాలి. వచ్చే ఎన్నికల నాటికి మిగిలిన రెండేళ్ల తొమ్మిది నెలలకు సరైన దిశా నిర్దేశంతో కార్యాచరణ రూపొందించుకోవాలి. ప్రజలు చూపిన విశ్వాసాన్ని మాటలతో కాకుండా సుపరిపాలనతో గౌరవించాల్సిన బాధ్యత అందరితో పాటు అధికారులు అందరిపైనా ఉంది..” అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గనిర్దేశం చేశారు.

## రోజుకో మలుపు

ప్రభుత్వానికి ఇచ్చారు. భూమి లేని నిరుపేదలకు ఒక గూడు దొరుకుతుందన్న వారి ఆశయం. అయితే భూదాన్ బోర్డు పేరుతోనే స్థలం ఉన్నప్పటికీ అధికారికంగా ఎవరికీ ఈ స్థలంలో పట్టాలు కేటాయించలేదు. కాలక్రమేణా ఖమ్మం పట్టణం విస్తరించడం, నగరంలో కొత్త కలెక్టరేట్ కూడా ఈ ప్రాంతానికి అత్యంత సమీపంలోనే నిర్మాణమవడంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఏళ్ల క్రితం 'దానం'గా వచ్చిన భూమి ఇప్పుడు కోట్ల రూపాయల 'బిజినెస్'గా మారిపోయింది. 10 ఏళ్లకుపైగా 'వినోబా నవోదయ కాలనీ' పేరుతో సుమారు 600 నుంచి 1,000 కుటుంబాలు అక్కడ గుడిసెలు, రేకుల ఇళ్లు వేసుకుని నివసిస్తున్నాయి. వీరికి మున్సిపల్ అధికారులు నల్లా కనెక్షన్లు ఇచ్చారు, విద్యుత్ శాఖ మీటర్లు బిగించారు. ప్రస్తుత ఉద్రిక్తతలకు రెండు ప్రధాన కారణాలు.. భూదాన్ బోర్డు ఆస్తులను రక్షించడంలో విఫలమైతే అధికారులదే బాధ్యత అని హైకోర్టు గతంలో స్పందించింది. దీంతో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దిగి స్థలం స్వాధీనం చేసుకోవాలని చర్యలు చేపట్టింది. ఇది ఒకవైపు నుంచి వినిపిస్తున్న వాదన. ఈ భూమికి కేవలం 500 మీటర్ల దూరంలోనే కొత్త కలెక్టరేట్ నిర్మాణం జరగడంతో, ఇక్కడి భూమి విలువ ఎకరాకు ₹10 కోట్లకుపైగా పెరిగింది. మొత్తం భూమి విలువ సుమారు రూ 250 నుంచి 300 కోట్లు కావడంతో అధికార యంత్రాంగం దీనిపై కన్నేసిందన్న విమర్శ రెండోది. ఈ వాదనలు ఇలా సాగుతున్న టైంలోనే ఈనెల 24న పెద్ద ఎత్తున ఆక్రమణల కూల్చివేత కార్యక్రమం జరిగింది. మూడు జిల్లాల నుంచి సుమారు 1,000 మందికి పైగా పోలీసుల పహారాలో, ఎస్.డి.ఆర్.ఎఫ్ (SDRF) బృందాల సమక్షంలో డజన్ల కొద్దీ జేసీబీలతో ఇళ్లను నేలమట్టం చేశారు. మహిళలు అడ్డుకోవడానికి ప్రయత్నించినా, కొందరు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడినా యంత్రాంగం వెనకడుగు వేయలేదు. 'మా ఓట్లు తీసుకునేటప్పుడు ఈ భూమి ప్రభుత్వానిదని తెలియదా?' అని బాధితులు ప్రశ్నించారు. ఇప్పుడు పూర్తిగా రాజకీయ రంగు పులుముకుంటోంది.. ఎన్నికలకు ముందు అన్ని పార్టీల వాళ్లూ తమకు పట్టాలిస్తామని చెప్పారు. ఇప్పుడు అధికార పార్టీ నేతలు కానీ జిల్లా నుంచే ఉన్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ హయాంలో ప్రభుత్వం కనీస వసతులు కల్పించగా, రేవంత్ సర్కారు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూల్చడం అమానుషమని బీఆర్ఎస్, వామపక్షాలు విమర్శిస్తున్నాయి. కారణాలేమైనా దశాబ్దాలుగా అక్కడ బతుకుతున్న పేదల జీవితాలు ఒక్కరోజులో రోడ్డున పడ్డాయి. ఉన్నట్టుండి నివాసాలు కూల్చేసి తాత్కాలికంగా ఫంక్షన్ హాళ్లలో వసతి కల్పించిన ప్రభుత్వం వారికి శాశ్వత ప్రత్యామ్నాయం మాత్రం చూపలేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. నేటి రియల్ ఎస్టేట్ బూమ్‌లో పెరుగుతున్న భూముల ధరలకు, సొంత గూడు కలకు మధ్య నలుగుతున్న పేదవాడికి పరిష్కారం చూపకపోతే ఈ వేడి ఖమ్మం నగరాన్ని మరింత రగిలించే అవకాశం కనిపిస్తోంది.

## బాలికలకు ఉచితంగా హెచ్ పీవీ టీకా

క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 20 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా. నివారణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.గర్భాశయ క్యాన్సర్ను నివారించడానికి, కేంద్ర ప్రభుత్వం నేడు దేశవ్యాప్తంగా హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (HPV) టీకా ప్రచారాన్ని ప్రారంభించనుంది. ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకారం, గార్డసిల్4 వ్యాక్సిన్ను ప్రభుత్వ కేంద్రాల్లో ఉచితంగా ఇస్తారు. టీకాతో పాటు స్క్రీనింగ్ ప్రాముఖ్యతను నిపుణులు వివరిస్తున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 80,000 కొత్త కేసులు, 42,000 కంటే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి. గర్భాశయ క్యాన్సర్ను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా హ్యూమన్ పాపిల్లోమావైరస్ (HPV) టీకా ప్రచారాన్ని ప్రారంభించింది. భారతదేశంలో ప్రధాన ఆరోగ్య సమస్యగా ఉన్న గర్భాశయ క్యాన్సర్ నుండి దేశవ్యాప్తంగా 14 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న బాలికలను రక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.9 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల అందరు బాలికలకు HPV వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి. ఈ వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్ నుండి దాదాపు 98 శాతం రక్షణ కల్పిస్తుంది. శరీరం రోగనిరోధక వ్యవస్థ చిన్న వయస్సులోనే మెరుగ్గా స్పందిస్తుంది. కాబట్టి 14 సంవత్సరాల వయస్సు ఉన్న బాలికలకు ఒకే మోతాదు సరిపోతుందని భావిస్తున్నారు. 15 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న బాలికలకు రెండు నుండి మూడు మోతాదులు అవసరం కావచ్చు. ఈ వ్యాక్సిన్ 26 సంవత్సరాల వయస్సు వరకు అత్యంత ప్రభావవంతంగా ఉంటుంది. పెద్ద వయసులో కూడా, మహిళలు వైద్యుడిని సంప్రదించిన తర్వాత ఈ వ్యాక్సిన్ పొందవచ్చు. ఈ వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్ను మాత్రమే కాకుండా కొన్ని ఇతర రకాల గొంతు క్యాన్సర్లను కూడా నివారించడంలో సహాయపడుతుంది.

# ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఎప్ స్టీన్ ఫైల్స్



జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారులు, రాజకీయ నాయకులు, దేశాల అధ్యక్షులు, కంపెనీల అధినేతలు వణికిపోతున్నారు. ఎప్‌స్టీన్ కేసు మళ్లీ ప్రపంచాన్ని కుదిపేస్తోంది. గతంలోనే అంతర్జాతీయంగా పెద్ద చర్చకు దారితీసిన ఈ వ్యవహారం.. ఇప్పుడు కొత్తగా వెలుగులోకి వస్తున్న ఫైల్స్‌తో మరోసారి ప్రభావం చూపుతోంది. ప్రముఖ వ్యాపార, విద్యా, రాజకీయ రంగాలకు చెందిన వ్యక్తుల పేర్లు బయటకు రావడం, ఆ తర్వాత రాజీనామాల పరంపర మొదలవడం.. ఇది సాధారణ పరిణామం కాదు. ప్రపంచ స్థాయి సంస్థల విశ్వసనీయత, నైతిక ప్రమాణాలపై గంభీరమైన ప్రశ్నలను లేవనెత్తే పరిణామంగా ఇది మారింది. ఈ సందర్భంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూ ఈ ఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే రాజీనామా అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ ఆర్థిక విధానాలను ప్రభావితం చేసే ప్రముఖ వేదికకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తి.. ఇలాంటి ఆరోపణల నడుమ తప్పుకోవడం సంస్థపై నేరుగా ప్రభావం చూపే అంశం. అమెరికా న్యాయ శాఖ విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బ్రెండే పేరు ప్రస్తావించబడడం.. ఆయన ఎప్‌స్టీన్‌తో భేటీ అయినట్లు ఆధారాలు బయటపడడం ఈ పరిణామానికి కారణమయ్యాయి. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలోనే ఆయన రాజీనామా చేయడం.. నైతిక బాధ్యతగా భావించవచ్చు. అయితే తన రాజీనామా లేఖలో ఈ అంశాన్ని నేరుగా ప్రస్తావించకపోవడం సందేహాలకు తావిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తి రాజీనామా కథ కాదు. హార్వర్డ్ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ గ్రహీత రిచర్డ్ ఆక్సెల్, గోల్డ్‌మన్ శాక్స్ లీగల్ ఆఫీసర్ క్యాథీ రూమ్లెర్, హయత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్జ్కర్, డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ అహ్మద్ , నార్వే అంబాసిడర్ మోనా వంటి ప్రముఖులు కూడా ఈ వివాదంతో తమ పదవులను వదులుకోవడం.. ఈ వ్యవహారం ఎంత విస్తృతంగా ఉందో తెలియజేస్తోంది. వ్యాపార దిగ్గజాలు, విద్యావేత్తలు, ప్రభుత్వ అధికారుల వరకు విస్తరించిన ఈ సంబంధాల నెట్‌వర్క్, అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకు కారణమవుతోంద ఈ పరిణామాల వల్ల ప్రధానంగా మూడు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. మొదటిది ప్రపంచ ఎలైట్ వర్గాల మధ్య ఉన్న సంబంధాల స్వభావం. రెండవది నైతిక బాధ్యత అనే అంశం. మూడవది సంస్థల పారదర్శకతపై ఉన్న నమ్మకం. ఎవరైనా చట్టపరంగా తప్పు చేశారనే విషయం నిరూపించబడకపోయినా.. ప్రజా విశ్వాసాన్ని కాపాడుకోవడానికి నాయకులు రాజీనామా చేయాల్సిన పరిస్థితి రావడం.. నేటి ప్రపంచంలో నైతిక ప్రమాణాలు ఎంత కీలకమో చూపిస్తోంది. ప్రత్యేకంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వంటి సంస్థల విషయంలో ఈ అంశం మరింత ప్రాముఖ్యం సంతరించుకుంటుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే వేదికగా ఉన్న ఈ సంస్థపై ప్రజలకు నమ్మకం ఉండాలి. అందుకే ఏ చిన్న వివాదం కూడా పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉంది. బ్రెండే స్థానంలో తాత్కాలికంగా అలోయిస్ జ్వింగి బాధ్యతలు చేపట్టడం, సంస్థ కొనసాగింపుకు అవసరమైన చర్యగా కనిపిస్తున్నా, దీర్ఘకాలికంగా సంస్థ ప్రతిష్టను పునరుద్ధరించడం పెద్ద సవాలుగా మారింది. అదే సమయంలో ఈ ఫైల్స్ విడుదలలో పారదర్శకత ఎంత వరకు ఉందనే ప్రశ్న కూడా లేవనెత్తబడుతోంది. దర్యాప్తు వివరాలు పూర్తిగా బయటకు రాకపోవడం.. సమాచారం గోప్యంగా ఉంచడం ఇవి మరోవైపు అనుమానాలను పెంచే అంశాలు. ప్రజలకు పూర్తి నిజాలు తెలియజేయకపోతే, ఊహాగానాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. మొత్తం మీద ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం ఒక వ్యక్తి లేదా కొన్ని రాజీనామాలకే పరిమితం కాదు. ఇది ప్రపంచ ఎలైట్ వ్యవస్థలో ఉన్న బలహీనతలను బహిర్గతం చేస్తున్న సంఘటనగా చూడాలి. సంస్థల విశ్వసనీయత, నాయకుల నైతిక బాధ్యత, పారదర్శకత ఈ మూడు అంశాలు భవిష్యత్తులో మరింత కఠినంగా పరీక్షించబడే అవకాశం ఉంది. ఈ పరిణామాలు గ్లోబల్ స్థాయిలో పరిపాలనా విధానాలపై, నాయకత్వ ప్రమాణాలపై కొత్త చర్చలకు దారి తీస్తున్నాయి. ఎప్పుడు ఎవరి బాగోతం బయట పడుతుందో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ ఇప్పటికే తప్పు అంగీకరించాడు. ఇక డొనాల్డ్ ట్రంప్ కూడా ఇందులో ఉన్నాడు. అయితే తాజాగా బయటపడిన ఈ ఫైల్స్ కారణంగా పలు కంపెనీల దిగ్గజాలు కూడా ఉన్నారు. వీరు రాజీనామా బాట పడుతున్నారు. తాజాగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే తన పదవికి రాజీనామా చేశారు, దవోస్ సమ్మిట్‌ల సంస్థకు ఇది భారీ దెబ్బ. హార్వర్డ్ యూనివర్సిటీ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ బహుమతి విజేత రిచర్డ్ ఆక్సెల్ కూడా బాధ్యతల నుంచి వైదొలిగారు. ఈ ముగ్గురూ ఎప్‌స్టీన్ ఈవెంట్స్‌లో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.వాల్ స్ట్రీట్ జెయింట్ గోల్డ్‌మన్ సాక్స్‌లో చట్టపరమైన విభాగం హెడ్ క్యాథీ రూమ్లెర్, హయాత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్జ్కర్ తమ స్థానాలు వదులుకున్నారు. గ్లోబల్ పోర్ట్ ఆపరేటర్ డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ అహ్మద్ బిన్ సులాయెం, నార్వే అంబాసిడర్ మోనా జుహానీ కూడా రాజీనామా చేశారు. ఈ లిస్ట్ రోజుకొకకొన సాగుతోంది, ఫైనాన్షియల్ మార్కెట్లలో అనిశ్చితి పెరుగుతోంది.ఎప్‌స్టీన్ డాక్యుమెంట్స్‌లో 170+ ప్రముఖుల పేర్లు వచ్చాయి. ఇందులో పొలిటీషియన్లు, బిజినెస్ టైకూన్లు, సైంటిస్టులు ఉన్నారు. ఈ ఆరోపణలు సెక్సువల్ ట్రాఫికింగ్, ఇన్‌ఫ్లుయెన్స్ పెడ్లింగ్‌కు సంబంధించినవి. ఫైనల్ కోర్ట్ ఆర్డర్‌తో ఈ ఫైల్స్ పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చాయి, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈ రాజీనామాలు #MeToo ఉద్యమం తర్వాత ఎలైట్ అకౌంటబిలిటీకి కొత్త ఎపాక్‌ను ప్రారంభిస్తున్నాయి. డబ్ల్యూఈఎఫ్ విశ్వసనీయత క్షీణించడంతో గ్లోబల్ పాలసీ చర్చలు ప్రభావితమవుతాయి. హార్వర్డ్‌లో నాయకత్వ షేకప్ విద్యా రంగంలో పరిణామాలకు దారితీస్తుంది. ఫైనాన్షియల్ రంగంలో గోల్డ్‌మన్ సాక్స్ షేర్లు 5 శాతం పడిపోయాయి, మార్కెట్ అనిశ్చితి పెరిగింది.

## కవిత ఇక అన్ స్టాపబుల్

సొంత కుంపటి పెట్టుకునేందుకు గ్రౌండ్ ప్రేపర్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆమె జిల్లాల పర్యటన చేస్తూ.. ఫైనల్‌గా పార్టీ పెడతానని కూడా ప్రకటించారు. ఇక లేటెస్ట్‌గా కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో సంతోషం వ్యక్తం చేసిన కవిత.. సత్యమే గెలుస్తుందన్న నమ్మకం పెరిగిందన్నారు. ఎప్పటికైనా కడిగిన ముత్యంలా బయటకు వస్తానని తెలుసు. ఈ రెండున్నరేళ్లు చాలా మంది అవమానకరంగా విమర్శలు.. సోషల్ మీడియాలో ట్రోల్స్ చేసి వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. కవితకు క్లీన్ చిట్ రావడంపై సంతోషం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్, దానికి కవిత చేసిన రీట్వీట్ కలకలం రేపుతోంది. ఈ ట్వీట్‌లో కవితకు కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడాన్ని స్వాగతిస్తూనే.. తమ ప్రభుత్వం పడిపోయేందుకు ఈ తప్పుడు కేసు కూడా కారణమయ్యిందంటూ కేటీఆర్ చెప్పడాన్ని కవిత తప్పుబట్టారు. తాను జైలుకు వెళ్లేంత వరకూ కేటీఆర్ కానీ, కేసీఆర్ కానీ ఎందుకు ప్రెస్‌మీట్ పెట్టలేదని కవిత ప్రశ్నించారు.బతుకమ్మకు తాను బ్రాండ్ అంబాసిడర్‌గా మారితే వాటి స్థానంలో లిక్కర్ బాటిల్స్ పెట్టిన సమయంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా ఎక్కడుందన్నారు. బీఆర్ఎస్ ఓటమిని తన మెడలో వేయాలని కేటీఆర్ చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు వాస్తవాలు అర్థం చేసుకోవాలన్నారు. రెండు నెలల్లో తాను కొత్త పార్టీ పెట్టబోతున్నానని, అలాంటి సమయంలో ఈ తీర్పు రావడం దేవుడి ఆశీర్వాదం అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అంటూ మరోసారి అటాక్ చేశారు కవిత.

కవిత ఇప్పటికే బీఆర్ఎస్ టార్గెట్ గా విమర్శల దాడి చేస్తున్నారు. ఇప్పటికీ మాజీ మంత్రి హరీశ్‌రావు, సంతోష్ టార్గెట్‌గా అలిగేషన్స్ చేస్తూనే ఉన్నారు. జిల్లాల పర్యటనలో కూడా కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులనే టార్గెట్ చేసి చర్చకు దారితీస్తున్నారు. ఇప్పుడు కేటీఆర్ ట్వీట్‌కు రిప్లై ఇచ్చి మరోసారి కారు పార్టీకి సవాల్‌గా మారారు. ఇప్పటికే జిల్లాల పర్యటన చేస్తున్న కవిత..మున్సిపల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కలిసి పోటీ చేసి ఓ మున్సిపాలిటీని స్వాధీనం చేసుకున్నారు. త్వరలో రాజకీయ పార్టీ ప్రకటిస్తానని..ఆ తర్వాత కొందరికి చాలా షాక్‌లు ఉంటాయంటూ కామెంట్స్ చేసి చర్చకు దారితీస్తున్నారు. అయితే పార్టీ ఏర్పాటుపై అయినా..లేక ఏ పార్టీలోకి వెళ్లాలన్నా..భవిష్యత్‌లో పొత్తుల కోసమైనా ఆమెకు ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఆరోపణలు అడ్డంకిగా ఉండేవి. ఇప్పుడు అలిగేషన్స్‌కు కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో పొలిటికల్‌గా కవిత ఇక అన్ స్టాపబుల్ అన్న చర్చ జరుగుతోంది.ఇప్పటికే బీఆర్ఎస్‌తో విభేదించిన కవిత.. కారు, కమలం పార్టీలు ఒక్కటే అంటూ అలిగేషన్స్ చేస్తున్నారు. ఫ్యూచర్‌లోనూ బీఆర్ఎస్, బీజేపీ టార్గెట్‌గా ఆమె పొలిటికల్ ఫైట్ కొనసాగే అవకాశం ఉంది. కవిత కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునే అవకాశాలపై ఈ తీర్పు కొత్త ఊపిరులు ఊదినట్టైంది. ఒకవేళ పొత్తుకు అవకాశముంటే క్లీన్ చిట్ రూట్ క్లియర్ చేసినట్లే. కవిత కొత్త పార్టీ పెట్టినప్పటికీ బీజేపీబీఆర్ఎస్‌పైనే దాడి చేసే ఛాన్సెస్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో కవిత దూకుడు ఎలా ఉంటుందో? ఆమె రాజకీయ అడుగులు ఎటు వైపు పడతాయో చూడాలి.

## భూభారతి కాదు.. అది భూదోపిడీ

జరిపించాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు డిమాండ్ చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకుంటూ తీసుకొచ్చిన భూ భారతి పోర్టల్ ఇప్పుడు అక్రమార్కులకు అడ్డాగా మారిందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ధ్వజమెత్తారు. ధరణి మీద బురదజల్లి భూభారతి తెచ్చామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడు ఆ పోర్టల్‌లో జరుగుతున్న కుంభకోణంపై ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. జనగామ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఏ రకంగా భ్రష్టు పట్టించిందో రైతులను ఎలా మోసం చేస్తోందో వివరించారు. ధరణి పోర్టల్‌లో లోపాలున్నాయంటూ పదే పదే విమర్శలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ తో భూ భారతి తెచ్చామని గొప్పలు చెప్పిందని, కానీ ఆ పోర్టల్ ఇప్పుడు ఖజానాకు గండి కొడుతూ దళారులకు భూ హారతిగా మారిందని దుయ్యబట్టారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు పూర్తి డబ్బులు కడుతుంటే, భూ భారతి పోర్టల్ ఎడిటింగ్ ఆప్షన్ వాడుకుని కేవలం 10 శాతం మాత్రమే ప్రభుత్వానికి చెల్లించి, మిగతా 90 శాతం దళారులు జేబుల్లో వేసుకున్నారని విమర్శలు గుప్పించారు. 37 మండలాల్లో ఈ భూ భారతి కుంభకోణం దర్జాగా నడుస్తుంటే, కనీసం నిఘా వ్యవస్థలకు కూడా తెలియకపోవడం ఈ ప్రభుత్వ వైఫల్యమేనని చురకలంటించారు. విలేకరులు వార్తలు రాస్తే తప్ప ముఖ్యమంత్రికి, రెవెన్యూ మంత్రికి ఈ స్కామ్ గురించి సోయి లేదని, ఈ భారీ కుంభకోణం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద అధికారులు ఉన్నారని, వాళ్ల పేర్లు బయటకు రాకుండా కవర్ చేయడానికే నామమాత్రంగా ఆపరేటర్లను అరెస్ట్ చేసి కేసులు నీరుగారుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టడానికి కమీషన్ల మీద కమీషన్లు, సిట్ లు వేస్తున్న రేవంత్ రెడ్డి. ఈ భూ భారతి కుంభకోణంపై, ప్రభుత్వ ఖజానా లూటీపై సిట్ తో విచారణ ఎందుకు జరిపించడంలేదని ప్రశ్నించారు. దీనిపై వెంటనే సిట్ వేసి దోషులను కఠినంగా శిక్షించాలని, ఖజానాకు రావాల్సిన ప్రతి పైసా రాబట్టాలని డిమాండ్ చేశారు. పేలని బాంబులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మొదలుకొని మండల స్థాయి అధికారుల వరకు అందరూ కలిసి నిషేధిత భూముల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని, లక్షల ఎకరాలను ఉద్దేశపూర్వకంగా నిషేధిత జాబితాలో పెట్టడం, వసూళ్లు కాగానే తీసేయడం ఈ ప్రభుత్వానికి నిత్యకృత్యంగా మారిందని, నేడు ఆ జాబితా కోటి ఎకరాలు దాటిందని, హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ తీరు మారడం లేదని ఎద్దేవా చేశారు. అసలు నిషేధిత జాబితాలో ఎన్ని భూములు పెట్టారో వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ హయాంలో 6 లక్షల 18 వేల మంది రైతులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా సాదా బైనామాలు చేసి పాస్ బుక్ లు ఇచ్చారని, రెండో విడత కోసం 8 లక్షల 92 వేల మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, గతంలో లేని విధంగా భూమి అమ్మిన వ్యక్తి బాండ్ పేపర్ పైన అఫిడవిట్ ఇవ్వాలని అనే కొత్త నిబంధన పెట్టి సాదా బైనామాకు ఉరితాడు బిగించారని హరీష్‌రావు మండిపడ్డారు.

## మైండ్ గేమ్ ఆలోచనలో గులాబీ బాస్

అభ్యర్థిని పోటీలో నిలబెట్టడం ద్వారా కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలో పడేయాలని చూస్తున్నారు. ఒకవేళ తమ అభ్యర్థికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఓటు వేస్తే, మైనార్టీల వ్యతిరేకిగా ముద్ర వేయవచ్చనేది ప్రతిపక్ష పార్టీ ఆలోచన. ఈ ఎత్తుగడ ద్వారా కాంగ్రెస్ తన అభ్యర్థుల ఎంపికలో మార్పులు చేసుకునేలా ఒత్తిడి తేవడమే ప్రధాన లక్ష్యం. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలను ఇరకాటంలో పెట్టడం కూడా ఈ పోటీ వెనుక ఉన్న మరో ఉద్దేశం. రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో పార్టీలు విప్ జారీ చేసే అధికారం కలిగి ఉంటాయి. అయితే, ఓటింగ్ రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరుగుతుంది. ఎవరు ఎవరికి ఓటు వేశారనేది పార్టీ ఏజెంట్లకు స్పష్టంగా తెలుస్తుంది. పార్టీ ఆదేశాలను ఉల్లంఘించి ఓటు వేస్తే పదవి పోతుందనే భయం ఒకవైపు, సొంత పార్టీకి వ్యతిరేకంగా వెళ్లలేని పరిస్థితి మరోవైపు ఫిరాయింపు ఎమ్మెల్యేలను వెంటాడుతున్నాయి. విప్ ఉల్లంఘనపై అనర్హత వేటు పడుతుందా లేదా అనే అంశంపై సుప్రీంకోర్టులో గతంలో భిన్నమైన తీర్పులు ఉన్నా, రాజకీయంగా వారిని దోషులుగా నిలబెట్టాలని బీఆర్ఎస్ ఆశిస్తోంది. ప్రస్తుతం శాసనసభలో కాంగ్రెస్ పార్టీకి 64 మంది సొంత ఎమ్మెల్యేలు ఉండగా, బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారితో కలిపి ఆ సంఖ్య 73కి పెరిగింది. ముగ్గురు పోటీలో ఉంటే రెండు స్థానాలను గెలవడానికి కావాల్సిన ఓట్లు సుమారు 80 ఓట్లు. మజ్లిస్ మద్దతుతో సాధించడం పెద్ద కష్టమేమీ కాదు. మజ్లిస్ పార్టీ మద్దతు కూడా కాంగ్రెస్‌కే ఉండే అవకాశం ఉండటంతో సంఖ్యాపరంగా అధికార పార్టీకి ఎటువంటి ఢోకా లేదు. బీఆర్ఎస్ పోటీ పెడితే మాత్రం ప్రతి ఓటును జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఉంటుంది. ఏమాత్రం తేడా వచ్చినా అది ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడిని పెంచుతుందిగెలుపు అవకాశాలు లేవని తెలిసినా బీఆర్ఎస్ మైనార్టీ కార్డును ప్రయోగించడం వెనుక ఆత్మప్రబోధానుసారం ఓటు అనే అంశాన్ని తెరపైకి తెచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ లోని అసమ్మతి నేతలు, మైనార్టీ అభ్యర్థి పట్ల సానుభూతి ఉన్నవారు తమకు ఓటు వేస్తారని బీఆర్ఎస్ ఆశిస్తోంది. ఇది కేవలం గెలుపు కోసం చేసే ప్రయత్నం కంటే కూడా, కాంగ్రెస్ పార్టీలో చీలికలు ఉన్నాయని నిరూపించడానికి చేసే ఒక రాజకీయ ప్రయోగం. ఒకవేళ కాంగ్రెస్ లోని మైనార్టీ ఎమ్మెల్యేలు లేదా ఇతర నేతలు ఈ విషయంలో అసంతృప్తి వ్యక్తం చేస్తే అది బీఆర్ఎస్‌కు పెద్ద విజయంగా మారుతుంది.ఈ రాజ్యసభ ఎన్నికలు కేవలం సభ్యుల ఎంపికతో ముగిసేవి కావు. వీటి ఫలితం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా ప్రభావం చూపుతుంది. మైనార్టీ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి కాంగ్రెస్ పడే తపన, వారిని ఇబ్బంది పెట్టడానికి బీఆర్ఎస్ వేసే ఎత్తుగడలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తాయి. అభ్యర్థుల ఖరారు నుండి ఓటింగ్ ముగిసే వరకు ప్రతి అడుగు అత్యంత కీలకంగా మారనుంది. అంతిమంగా ఈ యుద్ధం సంఖ్యాబలానికి, సామాజిక వ్యూహాలకు మధ్య జరుగుతున్న పోరాటంగా మిగిలిపోనుంది.

# బ్రహ్మోత్సవ వైభవం! భక్తులకు శుభం !!

- **అష్టోత్తర శతఘటాభిషేకంతో ముగిసిన నరసింహుని బ్రహ్మోత్సవాలు**

**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 28 :**



ఇరవై కుంట వాసుడైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో చివరి రోజు శనివారం ఉదయం స్వామి అమ్మవార్లకు జరిగిన అష్టోత్తర శతఘటాభిషేకంతో గత 11 రోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

**ఆ తీర్థం అమృతమే....**

ఉదయం ఆలయంలో స్వామి అమ్మవార్లకు 108 వెండి కలశాలను ఒక పీఠంపై పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం ఒక క్రమ పద్ధతిలో ఏర్పాటు చేశారు. వాటిలో 108 రకాల ఔషధాలు, ఓషధులు, పండ్ల రసాలు, వనమూలికలు తదితర వాటిని ఆ కలశంలో వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాటిపై 108 కొబ్బరికాయలను ఏర్పాటు చేసి వాటిపై పసుపు కుంకుమలతో... వివిధ రకాల పుష్ప మాలికలతో సౌభాగ్యమానంగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు.

**ఆలయ అనువంశిక**

ధర్మకర్త బి.నరసింహమూర్తికి, కమిషనర్ హనుమంతరావుకి, ఆలయ ఈవో భవానీ శంకర్ కు కంకణ ధారణ చేశారు. అనంతరం ఆ కళాశాలతో స్వయంభూ మూర్తులకు సుమారు మూడు గంటలపాటు అభిషేకాలు చేశారు. పంచ సూక్తాలు, పంచోపనిషత్తులు, దశశాంతులు,చతుర్వేద పారాయణాలతో, సుమారు మూడు గంటల పాటు అభిషే కాలు కొనసాగాయి.. అనంతరం స్వామి అమ్మ వార్లకు పట్టు వస్త్రాలను ధరింపజేసి వివిధ రకాల పుష్పమాలికలతో శోభాయ మానంగా అలంకారం చేసి ఈ దర్శనం క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు దర్శనాన్ని ప్రసాదించారు. అలాగే తీర్థప్రసాదాలను వినియోగించారు.

**ఆధ్యాత్మిక ఆనందంలో భక్త జనులు**

ఈ విశేష ఘట్టంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ మూర్తి,దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు,ఆలయ ఈఓ భవాని శంకర్,డీఈఓ దోర్బల భాస్కర శర్మ,ఏఈఓ రఘు,ఆలయ అధికారులు రాజన్ బాబు, నటరాజ్, సీతారామ చార్యులు, అధికారులు, అర్చకులు భక్తులు పాల్గొన్నారు. నృసింహుని సన్నిధిలో త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి కుటుంబ సభ్యులు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర సింహస్వామిని కుటుంబ సమేతంగా త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి దర్శించుకున్నారు. సాంప్రదాయబద్ధంగా ఆలయ ప్రధాన ద్వారం వద్ద అర్చకులు,అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనం అనంతరం వేద పండితులు గవర్నర్ దంపతులకు వేద ఆశీర్వచనం చేశారు. యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవాని శంకర్ త్రిపుర గవర్నర్ కు శ్రీ లక్ష్మి స్వామి వారి లడ్డు ప్రసాదం,చిత్ర పటం అందజేశారు.

# చేతిలో పార.. తలపై గంప ఎత్తి..

- **కూలీలతో కలిసి ఉపాధి పనుల్లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**జయభేరి, యాదగిరిగుట్ట :**



కూలీలతో కలిసి పారతో మట్టితోడి.. తలపై మట్టి గంప ఎత్తుకొని ఉపాధి హామీ పనులు చేసి కూలీల హర్షధ్వానాలు అందుకున్నారు. ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కూలీలతో మాటామంతి వికారాబాద్ లో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల సమావేశాలలో భాగంగా... శనివారం ఉదయం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులలో సహచర డీసీసీ అధ్యక్షులతో కలసి ఆయన పని చేశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను,స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పని అంటేనే మహాత్మ గాంధీ గారు గుర్తుకు వస్తారు.. అలాంటి ఆ పథకానికి మహాత్మ గాంధీ గారి పేరు. తొలగించడం సరికాదని అక్కడి కూలీలు తెలిపారు.

ఈ పథకం కాంగ్రెస్ సర్కారు....

బీర్ల అయిలయ్య కూలీల మాటలకు స్పందిస్తూ... గత యూపీఏ ప్రభుత్వంలో ప్రధాన మంత్రి గా మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్ పర్సన్ గా సోనియా గాంధీ కూలీలను ఆదుకోవాలనే మహోన్నత ఉద్దేశ్యంతో ..ఏ గ్రామంలో కూడా కరువు ఉండవద్దని, కూలీల వలసలు నివారించాలని ఈ మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి పథకం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఉపాధి హామీ పథకంతో కరువు ప్రభావిత గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి గ్రామీణ ప్రజలకు తక్షణ ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. నీటి సంరక్షణ,చెక్ డ్యామ్ కాలువల పునరుద్ధరణ వంటి పనులు భవిష్యత్ కరువు నివారణకు దోహదం చేస్తాయని అన్నారు. రైతులు,కూలీలకు ఉపాధి కల్పించడం మాత్రమే కాకుండా గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి కూడా ఈ పథకం ద్వారా సాధ్యమవుతోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాన్ని వినియోగించుకోవాలని గ్రామస్థులకు పిలుపునిచ్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

**గాంధీ పేరు తొలగింపు తగదు..**

ఇలాంటి గొప్ప పథకంలో ఈ మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరు తొలగించాలని చూస్తున్నారని అన్నారు. ఈ పథకాన్ని ఇదే విధముగా కొనసాగించాలని లేదంటే భారత దేశ ప్రజలు మీకు బుద్ధి చెబుతారని, ఈ పథకానికి మహాత్మాగాంధీ గారి కొనసాగించాలని. పేరు మారిస్తే మీరు గొప్ప వాళ్ళు ఏమి కారు అన్నారు. పేరు మారిస్తే.. పేదల బతుకులు మారుతాయా? పేరు మారిస్తే ఎవరి బతుకులు మారవు,మార్చేది పేరు కాదు పేదవాడి బతుకులు మార్చాలన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేసుకొని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకాన్ని ఇలాగే కొనసాగించి పేద ప్రజలకు అండగా ఉంటామని బీర్ల ఐలయ్య వారితో అన్నారు.



# ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కృతజ్ఞతలు

- **ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే**

**జయభేరి, దేవరకద్ర :**

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు శనివారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని అడ్డాకుల మండలం రాచాల అనుబంధ గ్రామమైన నాగాయపల్లిలోని బోటుక సాయమ్మ, ఆంజనేయులుల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులకు ఎమ్మెల్యే దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు తమ కుటుంబం తరఫున ఎమ్మెల్యే జీఎంఆర్ దంపతులు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, సొంతింటి కలను నిజం చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు వారు ధన్యవాదాలు తెలియజేశారు. ఇందిరమ్మ ఇండ్ల ను ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ పాలకవర్గ పదవీ బాధ్యతల స్వీకరణ

- **మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలే వచ్చే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో పునరావృతం అవుతాయి**
- **దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్**

**జయభేరి, దేవరకద్ర :**



జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలే వచ్చే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో పునరావృతం అవుతాయని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ పాలకవర్గ పదవి బాధ్యతల స్వీకారోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీ చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దేవరకద్ర నియోజకవర్గం లో అద్భుతమైన విజయాన్ని అందించిన కొత్తకోట మున్సిపాలిటీ ప్రజానీకానికి ఎమ్మెల్యే పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో మరోసారి రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్టపడి పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. అనంతరం అనంతరం 9వ వార్డులో నూతన వాటర్ బోరును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే తీసుకురావాలి

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుల వినతి**



**జయభేరి, దేవరకద్ర :**

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే తీసుకురావాలని శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే, హైకోర్టు న్యాయవాది జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆధ్వర్యంలో తెలంగాణలోని వివిధ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వినతిపత్రం అందజేశారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి వచ్చే అసెంబ్లీ సమావేశాలలో ఈ బిల్లు పెడతామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అడ్వకేట్ ల తరపున ఎమ్మెల్యే జిఎంఆర్ కృతజ్ఞతలు తెలిపినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.



# ఎస్సీ, ఎస్టీ ప్రజలు హక్కుల పట్ల అవగాహన పెంచుకోవాలి

- **డిప్యూటీ తహసీల్దార్ ముద్ద రాజు**

**జయభేరి, చర్ల, ఫిబ్రవరి 28 :**

ప్రజలు తమ హక్కుల పట్ల ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని చర్ల డిప్యూటీ తహసీల్దార్ ముద్ద రాజు పేర్కొన్నారు.శనివారం లక్ష్మి కాలనీ గ్రామ పంచాయతీ కార్యాలయంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ వారిచే ఏర్పాటు నిర్వహించిన పౌరహక్కులపై అవగాహన సదస్సు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఎస్సీ,ఎస్టీ ప్రజల పట్ల ఇతర కులాలకు చెందిన వారు అమర్యాదగా ప్రవర్తిస్తే తీవ్రమైన చట్ట పరమైన చర్యలు ఉంటాయని ఎవరైనా హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఎస్సీ ఎస్టీ ప్రజల శ్రేయస్సు మేరకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారి చట్టాలపై అవగాహన పెంచేలా స్థానిక రెవిన్యూ శాఖ మరియు పోలీసు శాఖతో కలిసి షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిరంతరాయంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తోందిని సూచించారు.ఇలాంటి అవగాహన సదస్సులను ఎస్సీ ఎస్టీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లక్ష్మి కాలనీ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం జోగ మహాలక్ష్మి ఉప సర్పంచ్ పూనెం సంతోషి,ఎస్సీ బాలుర వసతి గృహం సంక్షేమ అధికారి జి.శ్రీనివాసు, పంచాయతీ సెక్రటరీ రవికుమార్,వార్డు మెంబర్లు తడికల శివ కుమార్,బీరబోయిన శేఖర్,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# చలి వేంద్రాన్ని ప్రారంభించిన తాసిల్దార్



**జయభేరి, చర్ల, ఫిబ్రవరి 28 :**

చర్ల,మండలంలోని బిఆర్ యస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని చర్ల మండల తాసిల్దార్ శ్రీనివాసరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ప్రజలకు చాలా ఉపయోగం మీకు అభినందనలు స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా ఇంకా చలి వేంద్రాలు ఏర్పాటు చేయుటకు ముందుకు రావాలని తెలియజేసారు.కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతు గత సంవత్సరం కూడ మా పార్టీ తరుపున 22 వేల రూపాయలతో ఫ్రిజ్ కొని మార్చి నుండి జూన్ వరకు 4 నెలలు నిరంతరం అనేక గ్రామాల నుండి వచ్చె గిరిజనులకు ప్రతీ ఆదివారం సంత వ్యాపారస్తుల సంతకు వచ్చే వారికి దాహం తీర్చేందుకు 8 వేలు నీళ్లుకు ఖర్చు పెట్టి బీద ప్రజల దాహం తీర్చేందుకు కృషి చేసాము ఈ సంవత్సరం కూడా ప్రజల కోసం చలి వేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది అన్ని అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించడంలో నాకు చాలా తృప్తిగా ఉంది ఈ సందర్భంగా తాసిల్దార్ గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాకి అనిల్,తోటపల్లి మాధవరావు, బిసి సెల్ అధ్యక్షుడు గోరంట్ల వెంకటేశ్వరావు, కునుకు భద్రం, అలవాల కృష్ణ, ప్రేమ్ యూత్ నాయకులు బొజ్జ సాయిప్రణీత్ ఎనమూరి సృజన్ తోటపల్లి సాయి అంకాల శ్రీనివాసరావు మహిళ నాయకురాలు బేతం చర్ల నర్సవేణి చెనుమళ్ల వంశీ అనేకమంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్ణయంతో గోవర్ధన్ నాయి హర్షం

**జయభేరి, దేవరకద్ర :**

సర్పంచులకే అంగన్వాడి బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం బస్వాయిపల్లి గ్రామ ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గోవర్ధన్ నాయి శనివారం హర్షం వ్యక్తపరిచారు. సర్పంచులకు కొత్త అధికారాలు కట్ట పెడుతూ కీలక నిర్ణయం తీసుకోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల పరిశీలు, వాటి బాగోగుల బాధ్యతలు సర్పంచులకు అప్పగిస్తూ ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని ఆయన అన్నారు. నూతన సర్పంచులకు అధికారాలు అప్పగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జా రీ చేయడం పై ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి లకు గోవర్ధన్ నాయి కృతజ్ఞతలు తెలిపారు.

# శిరీష ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మున్సిపాలిటీ చైర్మన్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలోని ఇందిరమ్మ ఇంటి లబ్ధి దారురాలు లాల్ కోట శిరీష ఇందిరమ్మ ఇంటిని శనివారం స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ కొండ దమయంతి గోవర్ధన్ రెడ్డి దంపతులు ప్రారంభించారు. అలాగే లక్ష్మమ్మ, నరసింహల ఇందిరమ్మ ఇంటిని కూడా వారు ప్రారంభించారు. అలాగే ఇందిరమ్మ ఇంట్లో లబ్ధిదారులకు తమ కుటుంబం తరఫున వారు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, సొంతింటి కల నెరవేర్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవర్ధన్ రెడ్డి, ఆది హనుమంత్ రెడ్డి, వీరప్పయ్య దేవస్థానం చైర్మన్ నరసింహారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కురువ బీరప్ప, నర్వ శ్రీనివాసరెడ్డి, చెన్నప్ప లతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## డబుల్ బెడ్‌రూమ్ ఇల్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శంకర్

- లబ్ధిదారు కుటుంబాల ముఖాల్లో చిరునవ్వుల వెలుగులు

**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 28 :**

ప్రజలు పదేళ్లుగా ఎదురుచూస్తున్న స్వంత ఇంటి కల సాకారమవుతూ, డబుల్ బెడ్‌రూమ్ గృహాల పట్టాల పంపిణీ కార్యక్రమం షాద్ నగర్ లో ఘనంగా నిర్వహించబడింది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక కృషి, పట్టుదలతో ఈ పథకం అర్హులైన కుటుంబాలకు ఎంతో ఆసరాగా తొందరగా పూర్తి కావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు. ప్రజల అవసరాలను అర్థం చేసుకుని సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేస్తున్న నాయకుడిగా ఆయన పేరు మరింత ప్రతిష్టను సంతరించుకుంది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. స్వంత ఇల్లు ప్రతి కుటుంబానికి గౌరవం, భద్రత, భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారుల వరకు చేరాలనే సంకల్పంతో పని చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారుల్లో సలీమ బేగం ఆనందంతో మాట్లాడుతూ...ఎన్నేళ్ల నిరీక్షణ తర్వాత మా స్వంత ఇంటి కల నెరవేరింది. ఇది మా కుటుంబానికి మరపురాని రోజు అని భావోద్వేగంతో తెలిపారు. ఎమ్మెల్యే రుణపడి ఉంటామని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్ పత్తి నర్సింలు

- దామరకుంటలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం



**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 28 :**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం దామరకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి శనివారం ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు బక్కల చిన్న లక్ష్మి ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్ పత్తి నర్సింలు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని,కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని,నిరుపేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో సాకారం అవుతుందని గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతుందని,నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని,గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తామని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు.

## కొత్తూరు పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన

- ఫ్యూచర్ సిటీ సిపి సుధీర్ బాబు




**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 28 :**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కొత్తూరుపోలీస్ స్టేషన్‌ను ఫ్యూచర్ సిటీ సిపి సుధీర్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ ప్రాంగణం,రికార్డ్ రూమ్,స్టేషన్ రైటర్ రూమ్, రిసెప్షన్ సెంటర్ వంటి విభాగాలను పరిశీలించి,వాటిని చక్కగా నిర్వహించుకోవాలని సూచించారు.నేరాల రేటు,రోడ్డు ప్రమాదాలు,చోరీ కేసులు, నమోదైన కేసుల పురోగతిపై ఆయన ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో డిసిపి సిహెచ్ శిరీష,ఏసీపీ ఎస్ లక్ష్మి నారాయణ,సీఐ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్షర కిరణాలపై ఎఫ్ సీఎన్ సంస్థ ఔదార్యం

- లింగారెడ్డి గూడాలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, బెడ్ షీట్ ల పంపిణీ
- గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ అశోక్ చేతుల మీదుగా పంపిణీ




**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 28 :**

అక్షర కిరణాలుగా వెలుగుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాయం అందించడంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని చటాన్ పల్లి శివారులో గల ఎఫ్ సీ ఎన్ సేవా సంస్థ శనివారం ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, బెడ్ షీట్లు గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ అశోక్ అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ గీతా థామస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 60 మంది విద్యార్థులకు వీటిని అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలన్న ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు తరచూ చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, అశోక్ లు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి తమ గ్రామాన్ని ఎన్నుకోవడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయులు, వెంకటయ్య, తిరుమలయ్య, వెంకటయ్య, వార్డు సభ్యులు మలేష్ యాదవ్, గ్రంథాలయ నిర్వహకులు శంకరయ్య, వీరేష్ గౌడ్, ఖదీర్, బక్కని చిన్న నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


# కోడి కూయక ముందే ఏరులై పారుతున్న మద్యం

- పాలకమండలి తీర్మానం అతిక్రమించడం చట్టానికి విరుద్ధం
- ఒక కుటుంబం నాశనానికి మద్యం ప్రధాన కారణం
- షాపుల యజమానులు గ్రామ అభివృద్ధి కోసం ఆలోచించాలి
- నాగులపల్లి గ్రామ సర్పంచ్ నాల్లపురం రాధిక అశోక్ రెడ్డి




**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 28 :**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూక్ నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో మద్యం ఏరులై పారడం పట్ల తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసిన సర్పంచ్ నాల్లపురం రాధిక అశోక్ రెడ్డి. నూతనంగా ఏర్పడ్డ పాలకమండలి నాయకుల సమావేశంలో గ్రామ అభివృద్ధి కోసం ఆలోచించి మద్యం వలన గతంలో జరిగిన పరిణామాలు జరగకుండా ముందు జాగ్రత్త కోసం ఏ కుటుంబానికి నష్టం వాటిల్లకుండా బెల్ట్ షాపులను పూర్తిస్థాయిలో నిషేధించాలని గ్రామపంచాయతీ తీర్మానించడం జరిగిందని తీర్మానంలో మద్యం అమ్మకాలు నిషేధించాలన్న విషయాన్ని స్పష్టంగా వివరించామని వివరణ ఇచ్చిన మూడు నాలుగు రోజులు మౌనంగా ఉండి మళ్లీ అదే తరహాలో కొందరు కోడి కూయకముందే మద్యం షాపులు తెరిచి విక్రయాలు చేయడం గ్రామపంచాయతీ తీర్మానానికి, అదేవిధంగా చట్టానికి విరుద్ధంగా భావిస్తామని నాగులపల్లి సర్పంచ్ రాధిక అశోక్ రెడ్డి అన్నారు.


గ్రామ పంచాయతి కార్యాలయము – నాగుల్లపల్లి
ఫరుఖ్ నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా.
తేది: 10/2/2026
నోటీసు నెం:
మద్యపాన నిషేధం అమలు – బెల్ట్ షాపులకు నోటీసు
విషయం: గ్రామ పంచాయతి పరిధిలో అక్రమ మద్యం విక్రయాలు (బెల్ట్ షాపులు) పూర్తిగా నిషేధించబడినవి – ఆదేశాలు జారీ చేయుట గురించి.
సూచన: గ్రామ పంచాయతి నాగుల్లపల్లి బాడీ మీటింగ్ తీర్మానం తేది: 10/2/2026
వివరాలు: నాగుల్లపల్లి గ్రామ పంచాయతి బాడీ మీటింగ్ తేది: 10/2/2026 న జరిగిన సమావేశంలో తీసుకున్న తీర్మానం ప్రకారం, గ్రామ పంచాయతి నాగుల్లపల్లి పరిధిలో జరుగుతున్న బెల్ట్ షాపులు / అక్రమ మద్యం విక్రయాలు పూర్తిగా నిషేధించబడినవి.
కావున, ఈ నోటీసు ద్వారా సంబంధిత బెల్ట్ షాపు నిర్వాహకులు ____ గారికి తెలియజేయునది ఏమనగా:
1. తక్షణమే మద్యం విక్రయాలు పూర్తిగా నిలిపివేయవలెను.
2. ఎటువంటి మద్యం నిల్వ ఉండరాదు.
3. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన పక్షంలో, మీపై సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకొని, పోలీసు శాఖకు సమాచారం ఇవ్వబడును.
ఈ నోటీసు అందుకున్న తేది నుండి ఈ ఆదేశాలు అమలులో ఉంటాయి. ప్రజల శాంతి, భద్రత మరియు గ్రామాభివృద్ధి దృష్ట్యా ఈ నిర్ణ[illegible] తీసుకోబడినది. అందువల్ల అందరూ సహకరించవలసిందిగా కోరడమైనది.
పంచాయతీ కార్యదర్శి
గ్రామ పంచాయతి నాగుల్లపల్లి
సర్పంచ్
ప్రతి:
1. స్టేషన్ హౌస్ ఆఫీసర్ (S.H.O), షాద్ నగర్ పోలీస్ స్టేషన్ – సమాచారం మరియు అవసరమైన చర్యల కొరకు.
2. మండల అభివృద్ధి అధికారి (M.P.D.O), ఫరుఖ్ నగర్ మండలం – సమాచారం కొరకు.
WARD MEMBERS



**ఇది కేవలం మన గ్రామ అభివృద్ధి కోసం మాత్రమే...!**
**మద్యం వద్దు మార్పే మనకు ముందు...**

గ్రామ అభివృద్ధి కోసం మాత్రమే మద్యాన్ని సంపూర్ణంగా నిషేధించాలని తీర్మానించడం జరిగిందని, ఎవరు తమకు శత్రువులు కారు! అందరూ తమవారిని అయినా కూడా ప్రాణాలు పోతుంటే చూస్తూ మౌనంగా ఊరుకోవడం ఏమాత్రం సమంజసం కాదని చాలా కుటుంబాలు రోడ్డున పడి చిన్నాభిన్నమవుతున్నాయనీ మద్యం సంపూర్ణ నిషేధించాలని ప్రజల సంక్షేమం కోసం పాలకమండలి నాయకులము అందరం తీర్మానాన్ని ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖ వారికి కూడా విషయాన్ని క్షుణ్ణంగా దరఖాస్తు ద్వారా, తెలపడం జరిగిందని అయినా కూడా నిమ్మకు నీరందనట్టు మాకెందుకులే! అనే ధోరణిలో కొందరు షాపుల యజమానులు పట్టించుకోనట్టు వదిలేస్తున్నారని ఇలాంటి పరిణామాలు అందరి గడపలోకి కూడా చేరే అవకాశం లేకపోయిందని అన్నారు.

మనం బాగుంటే సరిపోతుందా! పక్కన వారు కూడా బాగుండాలి అనేది మా నినాదం.... నువ్వు మద్యం సేవించకపోవచ్చు నీ పక్క వారు, పక్కింటి కుటుంబ సభ్యుడు మద్యం సేవించి వచ్చిన డబ్బును వృధా చేస్తూ కుటుంబంలో వివాదాలు తగాదాలు చేసుకుంటూ ప్రాణాల మీదకు దాడులు తెచ్చుకుంటే మనకు ఆనందమా ఆవేదమా!! ఒక్కసారి ఆలోచించి మార్పుకు నాంది పలకండి మంచికి సహకరించండి అని ఎన్నిసార్లు తెలిపిన పరిస్థితి అదుపుతప్పుతుంది అని సర్పంచ్ రాధికా అశోక్ రెడ్డి పేర్కొన్నారు.



## కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మదనాపురం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద శనివారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజల ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓపెన్ పార్క్ కు కనీస సౌకర్యాలు లేవు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ఖిల్లా బజార్ లో 5 కోట్ల రూపాయలతో నిర్మించిన పార్కు పిచ్చి మొక్కలతో దర్శనం. పార్కులో అడ్డగోలుగా పిచ్చి మొక్కలు కలుపు మొక్కలు పెరిగిన పట్టించుకునే నాధుడే కరువయ్యాడు పార్కు ఓపెన్ అయ్యి రెండు సంవత్సరాలు అయినా ఇంతవరకు కనీస సౌకర్యాలు లేవు 1 వ వార్డ్ బిజెపి కౌన్సిలర్ గుండాల పద్మ అంజయ్య పార్కు ని సందర్శించి త్వరలోనే మున్సిపల్ కమిషనర్ కి మరియు AE కి వివరించి అన్ని సౌకర్యాలు కల్పిస్తానని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గుండాల పద్మ అంజయ్య సహదేవ్ చండీశ్వర్ బిక్కు హరి శేఖర్ శ్యామ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సైన్స్ దినోత్సవం




**జయభేరి, దేవరకొండ :**

స్థానిక ఎం కె ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ దేవరకొండ లో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం కార్యక్రమము కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ జి కోటయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సైన్స్ యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం భౌతికశాస్త్ర అధ్యాపకులు కళాశాల COE జి లింగారెడ్డి మాట్లాడుతూ సీవీ రామన్ గురించి ఆయన చేసిన పరిశోధన రామన్ ఎఫెక్ట్ గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ కోఆర్డినేటర్ సిహెచ్ లింగమయ్య, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ కే రేణుక, కంప్యూటర్ అధ్యాపకులు నర్మదా దేవి, జువాలజీ అధ్యాపకులు వెంకటేష్ తదితర కళాశాల సిబ్బందితోపాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు. అనంతరం విద్యార్థులకు సైన్స్ క్విజ్ నిర్వహించడం జరిగింది క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్ ఇవ్వడం జరిగింది.

# కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యాదయ్య గృహప్రవేశ కార్యక్రమం

- వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్
- రాష్ట్ర అధ్యక్షుడు వాలేపు శివకుమార్, వడ్డెర సంఘం నాయకులు



**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 28:**

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వడ్డే కృష్ణయ్య తమ్ముడు యాదయ్య గృహప్రవేశ కార్యక్రమానికి వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్ అదేవిధంగా రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్ పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడ్డే కృష్ణయ్య తమ్ముడు యాదయ్య గృహప్రవేశానికి ముఖ్య అతిథులుగా వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్, రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్ హాజరయ్యారు. అనంతరం గృహప్రవేశం పూజా కార్యక్రమంలో పాల్గొనీ తీర్థ ప్రసాదాల స్వీకరించారు. సంఘం నాయకులు గృహ యజమాని యాదయ్యకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణయ్య సంఘం నాయకులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర రాష్ట్ర సెక్రటరీ జరపాటి రాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ రవి, రిటర్న్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి, వడ్డెర సంఘం నాయకులు మంజునాథ్, షాద్ నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా కమిషన్ ఉపాధ్యాయ వేతనాలపై ఇచ్చిన రిపోర్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 28 :**




తెలంగాణ విద్యా కమిషన్ ఉపాధ్యాయ వేతనాలపై ఇచ్చిన రిపోర్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు పి ఆర్ టి యు టిఎస్ మండల అధ్యక్షుడు భాషెట్టి విష్ణు, ప్రధాన కార్యదర్శి సంకేపల్లి సంపత్ రెడ్డి లు అన్నారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ తెలంగాణ విద్యా కమిషన్ ఇటీవల ముఖ్యమంత్రికి సమర్పించిన రిపోర్టులో ఉపాధ్యాయ వేతనాలపై స్పందించడం అత్యంత విచారించదగ్గ అంశమని కమిషన్ తన పరిధిలో లేని అంశం పట్ల స్పందించడం ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర మనోవేదనకు గురి చేస్తుందని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాల ఆధారంగా పే రివిజన్ కమీషన్ ఉద్యోగుల, ఉపాధ్యాయుల జీతభత్యాలపై తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తాయని వారి రిపోర్టు ఆధారంగా వేతన అంశంపై ప్రభుత్వం తమ నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. సమాజం ఉపాధ్యాయులను చిన్న చూపు చూసేలా కమిషన్ వ్యవహరించడం సరికాదని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి వ్యక్తిత్వాన్ని భవిష్యత్తును నిర్మిస్తుందని అందుకే వారి జీతభత్యాలు కేవలం వేతనం కాదు అది వారి సేవకు సమాజం చెల్లించే గౌరవమని దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అన్న మాటలను గుర్తు చేస్తున్నట్టు తెలిపారు. భారతదేశంలోని అనేక రాష్ట్రాల్లో, ప్రపంచాల్లో చాలా దేశాల్లో, తెలంగాణ టీచర్ల కంటే అధికంగా జీతాలు అందుతున్నాయని ఈ రకమైనటువంటి రిపోర్టు ఇచ్చి ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతీసే ప్రయత్నం మానుకోవాలని అన్నారు. తక్షణమే రిపోర్టులో మార్పులు చేసి తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతం కోసం ప్రయత్నం చేయాలని ఉపాధ్యాయులు ఆత్మగౌరవాన్ని నిలబెట్టే ప్రయత్నం కొనసాగాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడులను రక్షించాలని అన్నారు. లేనిచో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గంధం శ్రీధర్ కాటబత్తిని అంబదాసు, నీల రమేష్, బుర్రి రామ్మోహన్, కళ్యాణి, కవిత హసీనా, సుజాత పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు జీతాలు తగ్గించాలని నివేదిక ఏమిటి?

- ప్రశ్నించిన కేంద్రమంత్రి బండి సంజయ్

**జయభేరి, హైదరాబాద్ :**



రిటైర్ ఉద్యోగులకు బెనిఫిట్స్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. విద్యారంగంపై రిటైర్డ్ ఐఎఎస్ ఆఫీసర్ ఆకునూరి మురళి ఇచ్చిన నివేదిక అసంబద్ధంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎవరితోనూ చర్చించకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా నివేదిక ఇచ్చారని విమర్శించారు. ఉపాధ్యాయులకు జీతాలు తగ్గించాలని నివేదిక ఏమిటి? అని.. ఉపాధ్యాయులకు జీతాలు తగ్గిస్తే.. విద్యా వ్యవస్థ బాగుపడుతుందా? అని బండి ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రి కూడా లేరని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

# స్వపరిపాలన దినోత్సవ దృశ్యం

**● ఘనంగా స్వపరిపాలన దినోత్సవం**

**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 28 :**



తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా, ఉపాధ్యాయులుగా పాత్రలను పోషించి అందర్నీ ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యేగా గుంటి అలేఖ్య, విద్యాశాఖ మంత్రిగా తాటికొండ అశ్విత, కలెక్టర్గా పరుచూరి జ్యోతి, జిల్లా విద్యాశాఖ అధికారిగా తుండుం మేనక, ప్రధానోపాధ్యాయులుగా తాటికొండ వైష్ణవి, ఏఏపిసి చైర్మన్గా మాలోతు గీత, జెడ్పిటిసి గా భూక్య సావిత్రి, ఉపాధ్యాయులుగా దీక్ష, సాక్షశిత, అశ్విని, రేణుక, గౌతమి, హరిత, హారిక, భువన శ్రీ, దుర్గాప్రసాద్ రామ్ చరణ్, ఇందు, హెన్నా, కళ్యాణి హాసిని పాత్రలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సోమల వెంకటేశం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నతమైన ఉద్యోగాలు సాధించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, బిక్షమయ్య, సతీష్ కుమార్, విశ్వేశ్వరరావు, సుజాత, హరిత, మధుకర్, అంబాజీ, వెంకటలక్ష్మి, గోవింద్, చంద్రమౌళి పాల్గొన్నారు. ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా విజ్ఞాన కృతుల మేళ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత శాస్త్రవేత్త సివి రామన్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు.

విద్యార్థులు రూపొందించిన విజ్ఞాన కృతులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకొని విజ్ఞానవంతులుగా తయారు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జాతీయ సైన్స్ దినోత్సవం

**● లైన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామినేషన్ కిడ్స్ పంపిణీ**

**జయభేరి, చందంపేట :**




జడ్పిహెచ్ఎస్ చందంపేట పాఠశాలలు జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులచే వివిధ ఎక్స్పరిమెంట్స్ మోడల్స్ చాట్స్ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించడం జరిగింది. అదేవిధంగా లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వారు పదవ తరగతి విద్యార్థులకు ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రాము చౌహాన్ సహకారముతో పరీక్షా సామాగ్రి పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షులు నారాయణ రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు ఏ భయం లేకుండా పూర్తి సన్నద్ధతతో పరీక్షలకు సిద్ధం కావాలని 100% రిజల్ట్ తేవాలని కోరినారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి లీల రాణి మాట్లాడుతూ లైన్స్ క్లబ్ వారు విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ చేయడం సంతోషదాయకమని అదేవిధంగా విద్యార్థులు కష్టపడి చదువుతున్నారని తప్పనిసరిగా 100% ఉత్తీర్ణత సాధిస్తామని మండలంలోని అత్యధిక గ్రేడును తీసుకువస్తామని హామీ ఇచ్చారు. రాము చౌహాన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎగ్జామినేషన్ ఫోబియో గురించి విద్యార్థులలో అవగాహన కల్పించారు. మరియు పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించి విద్యార్థులు తయారుచేసిన ఎక్స్పరిమెంట్లను పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ శ్రీనివాస్ కార్యదర్శి లకుమారపు మల్లయ్య మునిని అంజన్ గోవిందు కొండయ్య సీనియర్ ఉపాధ్యాయులు ఎం చంద్రశేఖర్ జోసెఫ్ చౌదరి రామచంద్రు విజయ ఎల్ మధు డాక్టర్ వెంకట్ సంధ్యారాణి విద్యార్థిని విద్యార్థులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు


**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 28 :**

తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామ పరిధిలోని విశ్వభారత్ గ్లోబల్ స్కూల్లో శనివారం సి.వి.రామన్ జయంతి పురస్కరించుకొని జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు చేసిన పలు ప్రాజెక్టులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తిలకించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, శైలజ, రామ లీల, రాజేశ్వరి, కల్పన ,శిరీష, స్వీటీ రెడ్డి, కవిత, నవనీత, విద్యార్థులు పాల్గొన్నారు.

## కుటంబాలకు తీవ్ర నష్టం

**● మల్లాపూర్ గ్రామ సర్వే నెం 84 లోని గ్రామ అబాధి స్థలాలను నిషేధిత జాబితా నుండి తొలగించాలి**

**● ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**జయభేరి, మల్లాపూర్ :**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, ఉప్పల్ మండలం, మల్లాపూర్ గ్రామం, గ్రామ అబాధి సర్వే నెం 84 లోని స్థలాలు సుమారు మూడు, నాలుగు తరాలుగా కుటంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఈ భూములు గ్రామ అభాది భూములే కాని 2007లో కోనేరు రంగారావు కమిటీ, రెవిన్యూ యాక్ట్ 2007 ఆమెన్మెంట్ ప్రకారం 22ఏ నిషేధిత జాబితాలోకి చేర్చటంతో భూములపై మ్యుటేషన్లు, రిజిస్ట్రేషన్లు, ఇంటి అనుమతులు సహా ఇతర సదుపాయాలు నిలిపి వేయబడ్డాయి. ఇది కుటంబాలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని స్థానికులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారిని కోరడంతో వారు మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరిని మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలవడం జరిగింది. ఈ సందర్భంగా మల్లాపూర్ గ్రామం, గ్రామ అబాధి, సర్వే నెం 84లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారి ఇంటి స్థలాలను 22ఏ నిషేధిత జాబితా నండి తొలగంపుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కి వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ కమిటీ సభ్యుడు పైళ్ల ప్రవీణ్ కుమార్, దుల్మిట్టా దయాకర్ రెడ్డి, రాపోలు శ్రీనివాస్, లింగాల రాజేష్ గౌడ్ పాల్గొన్నారు.

## కుషాయిగూడ 'విజన్ ఎక్స్' స్కూల్ ఎగ్జిబిషన్

కుషాయిగూడలోని గౌతమ్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విజన్ ఎక్స్' స్కూల్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్న వయసులోనే శాస్త్ర సాంకేతికత, సృజనాత్మక ఆలోచనలపై విద్యార్థులు చూపిస్తున్న ఆసక్తి అభినందనీయమని తెలిపారు. ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, భవిష్యత్తులో గొప్ప ఆవిష్కర్తలుగా ఎదగడానికి దోహదపడతాయన్నారు. ఎగ్జిబిషన్లో విద్యార్థులు రూపొందించిన శాస్త్ర నమూనాలు, ప్రయోగాలు, వినూత్న ప్రాజెక్టులను ఎమ్మెల్యే ఆసక్తిగా పరిశీలించి, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, దప్పు గిరిబాబు కోలా నరేష్ గౌడ్, గంప కృష్ణ శ్రీకాంత్ రెడ్డి శ్రీశైలం జై కృష్ణ మహిపాల్ రెడ్డి ప్రసాద్ రెడ్డి కొమ్ము రమేష్ సంపత్ కడియాల అనిల్ శేఖర్ నాయక్ బాలాజీ, పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్స్ కి చైర్మన్ కి ఘనంగా సత్కారం

**జయభేరి, దేవరకొండ :**




దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ కి వైస్ చైర్మన్ కి కౌన్సిలర్స్ కి ఘనంగా సత్కరించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు NVT మాట్లాడుతూ గెలిచిన వారిలో యువకులు ఎక్కువ సంఖ్యలో ఉండడం సంతోషకరం, అనుభవ ఆజ్ఞలు ఉండడం, అలాగే 19 వాడు కౌన్సిలర్ దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్ హ్యాట్రిక్ గెలవడం అనేది అభినందనీయమని, ప్రజల నిర్ణయం కాలనీ ప్రజలకు ఎంతో సేవ చేస్తే కానీ మూడుసార్లు ఎన్నుకోరు. అలాగే ప్రజాసేవ చేయడం అనేది అందరికీ రాదు అది గాడ్ గిఫ్ట్ కాబట్టి మీకు ఇచ్చిన ఈ అవకాశాన్ని ప్రజలకు అందుబాటులో ఉంటూ వాళ్లకు సేవ చేస్తూ మిమ్మల్ని నమ్ముకొని ఎలా ఎన్నుకున్నారు అలాగే మీరు కాలనీ ప్రజల అవసరాలను తీరువాలని అన్నారు. అలాగే దేవరకొండలో ఇండోర్ అవుట్డోర్ స్టేడియాలని నిర్మాణం చేయాలని అన్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని, క్రీడాకారులకు ఇండోర్ అవుట్డోర్ స్టేడియాల కోసం కృషి చేస్తామని అన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ వారికి మా సాయసాకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, గౌరవ అధ్యక్షులు పంతులాల్ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్ల సురేష్, సన్నీ, జమీర్, వంగూరు వెంకటేశ్వర్లు, బొడిగ వెంకటేష్, మహమూద్, భాస్కర్ రెడ్డి, బత్తుల అమర్, వైయస్ కరుణాకర్, జయలక్ష్మి, రాజేష్ ,కిరణ్ ,సాయి, మల్లయ్య, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# నేను ఎల్లప్పుడూ మీతోనే ఉంటా..


**● బీరప్పగడ్డ నివాసి కుటుంబానికి అండగా నిలిచిన ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)**

**జయభేరి, ఉప్పల్ :**



ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్), నా టీమ్ సభ్యుడు, నాకు అత్యంత సన్నిహితుడు అయిన రాజు తండ్రిని పరామర్శించడానికి ఉప్పల్ టీఎక్స్ హాస్పిటల్కు వెళ్లాను. ఆయన బీరప్పగడ్డ ప్రాంతానికి చెందినవారు. ఇటీవల ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాజు కుటుంబం మా కుటుంబానికి చిన్నప్పటి నుంచే ఎంతో ఆప్తంగా ఉంది. ఈ క్లిష్ట సమయంలో వారికి ధైర్యం చెప్పడం నా బాధ్యతగా భావించాను. ఆసుపత్రిలో వైద్యులను, హాస్పిటల్ మేనేజర్ను కలిసి రోగి ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు తెలుసుకుని, ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించాలని విజ్ఞప్తి చేశాను. రాజుకు ధైర్యం చెబుతూ, "మీరు బలంగా ఉండండి, ఆయన త్వరలోనే కోలుకుంటారు" అని నమ్మకం కలిగించాను. అలాగే కుటుంబానికి తక్షణ సహాయంగా కొంత ఆర్థిక సహాయం అందజేశాను. "మీకు ఎప్పుడైనా, పగలు లేదా రాత్రి ఏ సమయంలో అయినా సహాయం అవసరమైతే నన్ను సంప్రదించండి. నేను ఎప్పుడూ మీ కుటుంబానికి అండగా ఉంటాను" అని హామీ ఇచ్చాను. అలాగే రోగి భార్య, కుమార్తెను కలిసి, ఈ కష్టకాలంలో నేను ఎల్లప్పుడూ మీతోనే ఉంటానని, మీ కుటుంబానికి పూర్తి మద్దతు అందిస్తానని భరోసా కల్పించాను.





## సర్పంచుల ట్రైనింగ్ పూర్తి

**● ధ్రువీకరణ పత్రాన్ని డి పి.ఓ. శంకర్ నాయక్ చేతుల మీదుగా తీసుకోవడం చాలా ఆనందం**

**జయభేరి, దేవరకొండ :**

నల్గొండ పట్టణంలో నూతనంగా ఎన్నిక కాబడిన సర్పంచుల ట్రైనింగ్ పూర్తి చేసుకున్న సందర్భంగా రేకులగడ్డ గ్రామ సర్పంచ్ ఎలుక జలంధర్ గౌడ్ ధ్రువీకరణ పత్రాన్ని డి పి.ఓ. శంకర్ నాయక్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. జలంధర్ గౌడ్ మాట్లాడుతూ.. ధ్రువీకరణ పత్రం తీసుకోవడం చాలా ఆనందంగా ఉంది అని తెలియజేసినారు.

## కౌన్సిలర్ ఆరోగ్య పరిస్థితి నీ డాక్టర్ ను అడిగి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ పొట్ట మురళి ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ లోని ఆరోగ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం ఆరోగ్య ఆసుపత్రిలో పొట్ట మురళి నీ బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లను మెరుగైన వైద్యం అందించాలని ఆయన సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్, బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, ముదిగొండ హరిదాస్, శ్యామ్ తదితరులు ఉన్నారు.

## కౌన్సిలర్ తుమ్మేటి పాండును సన్మానించిన సర్పంచ్



**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 28 :**

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలో భువనగిరి హుస్నాబాద్ 14వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ గా గెలుపొందిన తుమ్మేటి పాండు యాదవ్ ను గ్రామ సర్పంచ్ బొత్త రాములు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జింకల యల్లేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 28 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని పడాల ముత్యాల మెమోరియల్ హైస్కూల్లో శనివారం సి.వి.రామన్ జయంతి పురస్కరించుకొని జాతీయ సైన్స్ దినోత్సవం, స్కూల్ ప్రెసెంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సోమల వెంకటేశం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చేసిన పలు ప్రాజెక్టులను తిలకిస్తూ విద్యార్థులలో చిన్ననాటి నుండి వారిలో సృజనాత్మకతను వెలికి తీసే ఇలాంటి కార్యక్రమాలు బాగా ఉపయోగపడతాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లలు అభివృద్ధికి దోహదం చేస్తాయని పాఠశాల యజమాన్యమును ఉపాధ్యాయ బృందమును, పిల్లలన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై విస్తృత చర్చ




**జయభేరి, ఉప్పల్ :**

BRS పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు దూరదృష్టిగల, చైతన్యవంతమైన నాయకత్వంలో భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలతో కలిసి నిర్వహించిన సమగ్ర సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సమావేశంలో ప్రజా సమస్యలపై విస్తృత చర్చ, పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజల ఆకాంక్షలను సమర్థంగా ప్రతిబింబించే స్పష్టమైన వ్యూహ రూపకల్పన వంటి కీలక అంశాలపై లోతైన చర్చ జరిగింది.



## నిక్కీ తంబోలి 'గోవా' వెకేషన్ వైరల్!

నిక్కీ తంబోలి 'చీకటి గదిలో చితక్కొట్టుడు' సినిమాతో కథానాయికగా తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత 'కాంచన 3', 'తిప్పరా మీసం' వంటి చిత్రాల్లో నటించింది. అయితే హీరోయిన్ గా ఆశించిన స్థాయిలో సక్సెస్ రాకపోవడంతో ఐటమ్ సాంగ్స్ పై ఫోకస్ పెట్టింది. హిందీ బిగ్‌బాస్ 14వ సీజన్‌లో సెకండ్ రన్నరప్‌గా నిలిచి దేశవ్యాప్త గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా 'ద 50' అనే రియాలిటీ షోలో కంటెస్టెంట్‌గా పాల్గొని మరోసారి లైమ్‌లైట్‌లోకి వచ్చింది. తాజాగా నిక్కీ తంబోలి తన సహకంటెస్టెంట్లతో కలిసి గోవా వెకేషన్‌కు వెళ్లింది. అక్కడ బ్లూ కలర్ పొట్టి డ్రెస్ లో దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అందరూ ఆమె డ్రెస్ గురించి మాట్లాడుకుంటారని అనుకుంటే, నెటిజన్ల దృష్టి మాత్రం ఆమె హీల్స్ పై పడింది. అవి 'డాల్స్ అండ్ గబ్బానా' అనే అంతర్జాతీయ లగ్జరీ బ్రాండ్‌కు చెందిన హీల్స్. వాటి ధర అక్షరాలా లక్ష 46 వేల రూపాయలు అని తెలియడంతో అందరూ షాక్ అవుతున్నారు. అలంకరణ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయడం నిక్కీకి చిన్నప్పటి నుండి ఉన్న అలవాటని తెలుస్తోంది. గ్లామర్ ప్రపంచంలో రాణించాలంటే మెయింటెనెన్స్ ఉండాలి కానీ, నిక్కీ తంబోలి రేంజ్ చూస్తుంటే అది నెక్స్ట్ లెవల్ లో ఉందనిపిస్తోంది. కేవలం ఒక జత చెప్పుల కోసం ఇంత ఖర్చు చేయడం అవసరమా అని కొందరు అంటుంటే, సంపాదించిన డబ్బును తమకు నచ్చినట్లు ఖర్చు పెట్టుకోవడంలో తప్పులేదని ఆమె అభిమానులు సమర్థిస్తున్నారు.




## ఏందయ్యా సామీ.. ఇట్ల కాస్తాందీ వెన్నెల

అగ్ర తారలు విజయ్ దేవరకొండ రష్మిక మందన్న ఇటీవలే వైవాహిక బంధంలోకి అడుగు పెట్టారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ పెండ్లి వేడుక దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలో కొత్త జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తూ 'రణబాలి' చిత్రబృందం సినిమాలోని వెడ్డింగ్ సాంగ్‌ను విడుదల చేశారు. 'గీత గోవిందం' 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్‌రష్మిక కలిసి నటిస్తున్న పాన్ ఇండియా 'రణబాలి' చిత్రంపై అభిమానుల్లో ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. 'రణబాలి'లో పెళ్లి వేడుక సందర్భంగా ఈ అందమైన పాటను తెరకెక్కించారు. 18వ శతాబ్దం నాటి వివాహ సంప్రదాయాలకు అద్దం పడుతూ మెలోడీ ప్రధానంగా ఈ పాట సాగింది. 'ఏందయ్య సామీ...ఇట్ట కాస్తాందీ వెన్నెల, ఊపేస్తావుంది సిత్తరాల ఉయ్యాలా, వీచే గాలికి అత్తరద్దిందెవ్వరు, మారే జాముకి మందు పెట్టిందెవ్వరు..' అంటూ చక్కటి ప్రణయభావాలతో ఈ పాట ఆకట్టుకునేలా ఉంది. అజయ్‌అతుల్ ఈ గీతాన్ని స్వరపరిచారు. 1854 1878 మధ్య బ్రిటీష్ కాలంలో జరిగిన యథార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజయ్‌అతుల్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, రవిశంకర్, కథ, దర్శకత్వం: రాహుల్ సంకృత్యాన్.

## ఊరి పెద్ద వెంకటప్పయ్య



అగ్ర హీరో మహేష్‌బాబు సోదరుడి కుమారుడు జయకృష్ణ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. అజయ్ భూపతి దర్శకుడు. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కమార్తె రషా తడాని కథానాయికగా నటిస్తున్నది. పి. కిరణ్ నిర్మాత. ఈ సినిమాలో సీనియర్ నటుడు మోహన్‌బాబు కీలక పాత్రను పోషిస్తున్నారు. వెంకటప్పయ్య నాయుడుగా ఆయన పాత్ర తాలూకు ఫస్ట్‌లుక్‌ను శనివారం విడుదల చేశారు. ఇందులో ఆయన సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో ఊరి పెద్దగా అధికార దర్పంతో కనిపిస్తున్నారు. గొప్ప సంకల్పంతో తన నేలను పాలించే వ్యక్తిగా వెంకటప్పయ్య నాయుడు పాత్ర అందరిని ఆకట్టుకుంటుందని, ప్రస్తుతం సినిమా చిత్రీకరణ జరుగుతున్నదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, ప్రొడక్షన్ డిజైనర్: సాహి సురేష్, నిర్మాణ సంస్థ: చందమామ కథలు, సమర్పణ: అశ్వినీదత్, రచనదర్శకత్వం: అజయ్ భూపతి.



## అమ్మ సంతోషమే ముఖ్యం ..

టాలీవుడ్ నటి సురేఖా వాణి ఆమె కూతురు సుప్రిత నాయుడు మధ్య ఉన్న అనుబంధం గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ తల్లీకూతుళ్లు స్నేహితుల్లా కలిసి ఉండటం, సోషల్ మీడియాలో తరచూ ఫొటోలు, వీడియోలు షేర్ చేస్తూ సందడి చేయడం తెలిసిందే. వారి ఆప్యాయత, ఓపెన్ బాండింగ్ ఎప్పుడూ చర్చనీయాంశం అవుతుంది. ఇటీవల సుప్రీత తన తల్లి భవిష్యత్తు గురించి చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. భర్త మరణం తర్వాత సురేఖ వాణి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆమెకు కూతురు సుప్రీత ప్రధాన ఆధారం అయింది. ఇప్పుడు అదే కూతురు తన తల్లి జీవితంపై తీసుకున్న నిర్ణయం అందరినీ ఆకట్టుకుంటోంది. నేను పెళ్లి చేసుకునే ముందు, నా అమ్మకు జీవితంలో ఒక మంచి తోడు ఉండాలి. ఆమెను ప్రేమగా చూసుకునే, గౌరవించే వ్యక్తి రావాలి అని సుప్రీత వెల్లడించింది. ఈ విషయాన్ని తాను కుటుంబ సభ్యులతో కూడా చర్చించానని, వారు కూడా తన అభిప్రాయానికి మద్దతు తెలిపారని చెప్పింది. అయితే ఇది కేవలం తన కోరిక మాత్రమే కాదని ఆమె స్పష్టం చేసింది. "అమ్మ సంతోషమే నాకు ముఖ్యం. ఆమె ఏ నిర్ణయం తీసుకున్నా నేను గౌరవిస్తాను. నాన్న స్థానాన్ని మరెవరికి ఇవ్వాలని ఆమెకు ఇష్టం లేదు. ఆమెను బలవంతం చేయను. కానీ అమ్మ ఒంటరిగా ఉండకూడదని మాత్రమే నేను కోరుకుంటున్నాను" అంటూ ప్రేమతో చెప్పిన మాటలు సోషల్ మీడియాలో హృదయాలను తాకుతున్నాయి.

## ఆ మూవీలో ఓ సీన్ కోసం రజినీకాంత్ 100 టేక్‌లు తీసుకున్నాడు...



నిర్మాత జి.వి. నారాయణరావు ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పలు కీలక విషయాలు తెలిపారు. లెజెండరీ నటుడు రజినీకాంత్ కెరీర్‌లో కీలకమైన చిత్రం అంతులేని కథలోని ఆయన పాత్ర గురించి విలువైన వివరాలను పంచుకున్నారు. రజినీకాంత్ ఈ చిత్రంలో ఒక తాగుబోతు, ఇంటి బాధ్యతలను పట్టించుకోని జులాయి అన్నయ్య పాత్రలో కనిపించారు. ఈ పాత్రలో ఆయన నటించిన కొన్ని సన్నివేశాలు ఎంతో సవాలుతో కూడుకున్నవని నారాయణరావు వెల్లడించారు.

ఒక సన్నివేశంలో, రజినీకాంత్ మద్యం తాగి ఇంటికి వచ్చినప్పుడు ఆయన చెల్లెలు సరిత తిట్టి బయటకు పంపేస్తుంది. అప్పుడు ఆయన "దేవుడే ఇచ్చాడు వీధి ఒకటి" అంటూ పాట పాడుకుంటారు. అర్ధరాత్రి తిరిగి వచ్చిన తర్వాత, భార్యతో శారీరిక సుఖానికి వెళ్తూ బిడ్డను వదిలేసి వెళ్ళడం, ఆ తర్వాత సరిత ఆయనను నేరుగా "ముండా" అని తిట్టడం వంటి తీవ్రమైన భావోద్వేగ సన్నివేశాలు ఈ చిత్రంలో ఉన్నాయి. అంతేకాకుండా, సొంత కొడుకు ముఖం మీద ఉమ్మేసే దృశ్యం వంటివి రజినీకాంత్ పాత్రకు మరింత లోతును జోడించాయి.

దేవుడే ఇచ్చాడు వీధి ఒకటి పాటలోని ఒక సింగిల్ షాట్ గురించి జి.వి. నారాయణరావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ షాట్‌లో రజినీకాంత్ బయట రోడ్డు మీద పాట పాడుతుంటే, సరిత కర్టెన్‌ను వేసి మళ్లీ తీస్తూ ఉంటుంది, రజినీకాంత్ సిగరెట్ తాగుతూ ఉంటారు. ఈ షాట్ దాదాపు 50 టేక్‌లు తీసుకుందని, రజినీకాంత్ మొదట్లో దీనిని చేయలేనని చెప్పినా, దర్శకుడు కె. బాలచందర్ పట్టుదలతో చేయించారని తెలిపారు. బాలచందర్ గొప్పతనం ఏమిటంటే, ఆయన నటులకు చేసి చూపించకుండా, వారిలోని అంతర్గత ప్రతిభను బయటకు తీసుకువస్తారని జి.వి. నారాయణరావు కొనియాడారు. రజినీకాంత్ సిగరెట్ ఎగరేసి పట్టుకునే ప్రసిద్ధ స్టైల్, ఆయనకు మంచి మాస్ ఇమేజ్‌ను తీసుకురావడానికి బాలచందర్ దర్శకత్వం ఎంతో సహాయపడిందని ఆయన పేర్కొన్నారు.

రజినీకాంత్ జయప్రదను "పౌడర్లు రాసుకుని, లిప్‌స్టిక్ వేసుకుని సాని దానలా వెళ్తున్నావా" అని తిట్టినప్పుడు, ఆమె తీవ్ర భావోద్వేగంతో, తాను ఈ పౌడర్‌ను సంపాదించడం కోసమే రాసుకుంటున్నానని, చెల్లెలి పెళ్లి, తమ్ముడి ఆపరేషన్ వంటి కుటుంబ అవసరాల కోసం డబ్బులు పొదుపు చేస్తున్నానని పాస్ బుక్కులను చూపిస్తూ సమాధానమిచ్చే సన్నివేశాన్ని వివరించారు. ఇంటి పెద్దగా నిలబడితే మెడపట్టి బయటికి పంపుతానని జయప్రద పాత్ర సవాలు విసురుతుంది. ఈ సన్నివేశాలను ఒకే షాట్‌లో చిత్రీకరించడం బాలచందర్ దర్శకత్వ నైపుణ్యానికి నిదర్శనం అని జి.వి. నారాయణరావు నొక్కి చెప్పారు. అంతులేని కథ రజినీకాంత్ సినీ ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**